సాక్షి
వైఎస్సార్ జిల్లా
బుధవారం, 25, అక్టోబర్, 2023



ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ సమాజ శ్రేయస్సు పేరుతో వినూత్న కార్యక్రమానికి మంగళ వారం శ్రీకారం చుట్టారు. -8లో



అధునాతన అగ్నిమాపక వాహనం ప్రారంభం

అధునాతన అగ్నిమాపక వాహనాన్ని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి.అంజద్‌బాషా, మేయర్ కె.సురేష్‌బాబు ప్రారంభించారు. -8లో

గరిష్టం/కనిష్టం
35.2/23.8

వాతావరణం

జిల్లాలో మంగళవారం 23.8 – 35.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

వైభవం.. శమీదర్శనం



శమీదర్శన ఉత్సవంలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఉత్సవ మూర్తి



బాణసంచా వెలుగు జిలుగులు

- వైభవంగా ముగిసిన దసరా ఉత్సవాలు
- ప్రొద్దుటూరులో కన్నులపండువగా సాగిన తొట్టి మెరవణి
- ప్రత్యేక ఆకర్షణగా సింగారిమేళం, వేషధారణలు

ప్రొద్దుటూరు కల్చరల్: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రొద్దుటూరు పట్టణంలో సోమ వారం సాయంత్రం శమీదర్శన మహోత్సవాన్ని వైభ వంగా నిర్వహించారు. విజయానికి, సకలశుభాలకు, సిరిసంపదలకు చిహ్నమైన శమీ వృక్షాన్ని విజయద శమి రోజు దర్శించి పూజలు నిర్వహిస్తే శుభప్రదమని దశమినాడు ఈ మహోత్సవాన్ని నిర్వహించడం ఆన వాయితీ. శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయం లో అమ్మవారి ఉత్సవ మూర్తిని కన్నులవిందుగా పట్టు వస్త్రాలతో, పూలతో, పుత్తడి ఆభరణాలతో అలంక రించి ఊరేగింపుగా తీసుకువచ్చి వాసవీ శమీవృక్ష మం డపంలో శమీదర్శన మహోత్సవం చేయించారు. చెన్న కేశవాలయ దసరా ఉత్సవ కమిటీ, అగస్త్యేశ్వరాల యం రాజరాజేశ్వరీ ఉత్సవ కమిటీ, రాజరాజేశ్వరి ఆల యం, దత్తాత్రేయస్వామి, ఆత్మారామస్వామి, సత్యనా రాయణస్వామి, విజయనగరంవీధిలోని చౌడేశ్వరీదేవి అన్ని ఆలయాల వారు కొర్రపాడు రోడ్డు మిల్లులోని శమీవృక్షం వద్ద దర్శనం చేశారు. కేరళ సింగారిమేళం, డిస్కోలైటింగ్, వేషధారణలు, డూప్ కళాకారుల నృ త్యప్రదర్శన, బాణసంచా పేళుల్లు, విద్యుత్ ఆర్చీల వెలుగులు, మంగళవ్యాద్యాల సందడి శమీదర్శనానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. లక్షమంది పైగా భక్తులు శమీదర్శన మహోత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించారు. కొందరు భక్తులకు ప్రసాద వినియోగం, మంచినీటి సౌకర్యం కల్పించారు.



పుట్టపర్తిసర్కిల్‌లో భక్తులు (ఇన్‌సెట్) తొట్టిమెరవణిలో వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి

కన్నులపండువగా తొట్టిమెరవణి

దేవీనవరాత్రుల సందర్భంగా విజయదశమిని పురస్కరించుకుని సోమవారం అర్ధరాత్రి వాస వీమాత తొట్టి మెరవణి ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవీనవరాత్రి ఉత్సవాల్లో ప్రాముఖ్యత సంతరించుకున్న ఈ తొట్టి మెరవణిలో వాసవీమాత శ్రీచక్రం ఉన్న పంచలోహ రథంపై (తొట్టిమెరవణి) భక్తులను కన్నులవిందు చేశారు. ఈ మహోత్సవం సోమవారం అర్ధరాత్రి మొదలై మంగళవారం తెల్లవారుజాము వరకు కొన సాగింది. పంచలోహ రథంపై అమ్మవారు కొలువు దీరి భక్తులకు దర్శనమిచ్చే ఈ వేడుకను తిలకించేం దుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. పుట్ట పర్తి సర్కిల్‌లో బాణసంచా పేలుళ్లు, చెట్లు, రాకెట్లు, పాములు వంటి బాణసంచా పేల్చి విజయదశమి వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు.

ఘనంగా వసంతోత్సవం



వసంతోత్సవంలో అమ్మవారు

స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆల యంలో దేవిశరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం వాస వీమాతకు వసంతోత్సవాన్ని ఘనంగా నిర్వ హించారు. వేకువజామున అమ్మవారికి విశేష అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రంగు రంగుల పూలతో, గజమాలతో, పుత్తడి ఆభరణాలతో, నూతన పట్టు వస్త్రములతో శోభాయమానం గా అలంకరించారు. అనంతరం అమ్మవారిని పుర వీధులలో అత్యంత వైభవంగా వాసవీ నామ స్మరణలతో ఊరేగించారు. దారి వెం బడి నీళ్లు చల్లుతూ భక్తులు అమ్మవారికి స్వాగతం పలికారు. భక్తిశ్రద్ధలతో అమ్మవా రిని దర్శించి కాయకర్పూరం నైవేధ్యంగా సమర్పించారు. డప్పువాయిద్యాల సందడి మధ్య భక్తులు రంగులు చల్లుకుంటూ ఉత్సా హంగా వసంతోత్సవాన్ని నిర్వహించారు.



కేరళ సింగారిమేళం



కళాకారుల వేషధారణలు



విద్యుత్ కాంతుల దివిటీలు



కళాకారుల ప్రదర్శన

బీడు భూముల్లో పచ్చదనం

పెట్టుబడులు పెరిగి నష్టాలు ఎదురై అప్పుల ఊబిలో కూరుకుపోతున్న శ్రమ జీవులు సాగును వీడుతున్న ప్రస్తుత తరు ణంలో పూర్వపు విధానాలను అనుసరించి మళ్లీ మూలాలను వెతుకుతూ సేద్యం వైపు అడుగులు వేస్తున్నారు అన్నదాతలు. ప్రకృతి సేద్యం చేస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

- డ్రాఫ్ట్ ప్రూఫింగ్ పద్ధతిలో పంటల సాగుకు శ్రీకారం
- మెట్ట ప్రాంతాల్లో కూరగాయల సాగువైపు అడుగులు
- జిల్లా వ్యాప్తంగా నాలుగు మండలాల్లో 22 ప్లాట్ల ఎంపిక



డ్రాఫ్ట్ ప్రూఫింగ్ మోడల్లో సాగు చేసిన పంటలు

కడప అగ్రికల్చర్: మార్కెట్లో లభించే రసాయన ఆహారంతో పొంచివున్న ప్రమాదాన్ని గుర్తించి దేశీయ విత్తనాలను వినియోగిస్తూ పంటల సాగు చేయించేందుకు ప్రకృతి వ్యవసాయం సిబ్బంది కృ షిచేస్తున్నారు. జిల్లాలో 2023–24 సంవత్సరంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా 93,982 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయించాలని లక్ష్యం పెట్టు కున్న అధికారులు 62,040 మంది రైతులను ఎం పిక చేసుకున్నారు. ఇప్పటి వరకు 56,228 ఎక రాల్లో పంటలు సాగు చేయించి 40,912 మంది రైతులు లబ్ధి పొందేలా చేశారు.

డ్రాఫ్ట్ ప్రూఫింగ్ పద్ధతిలో...

ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుం డా పలు రకాల ఆకుకూరలు, కూరగాయలను రైతులు నూతనంగా ఏటీఎం(ఎనీ టైం మనీ) మోడల్‌లో సాగు చేయించారు. 20 నుంచి 30 సెం ట్లలో 25 రకాల కూరగాయలు, ఆకుకూరల తోపాటు తీగజాతి కాయ పంటలను సాగు చేయిం చారు. తాజాగా డ్రాఫ్ట్ ప్రూఫింగ్ మోడల్లో పంటలు సాగు చేయిస్తున్నారు. ఇందుకోసం చక్రాయపేట, తొండూరు, వేముల, వీరపునాయనపల్లె, తదితర మండలాల్లో 22 ప్లాట్లు ఎంపిక చేశారు. ఒక్కో ప్లాట్ 50 సెంట్ల నుంచి 100 సెంట్ల వరకు ఉంటుం ది. ప్రధానంగా కంది, ఆముదం పంటలు సాగు చేశారు. అంతర పంటలుగా గోరుచుక్కుడు, సజ్జ, అనప, అలసంద వేస్తున్నారు.

ఎలా సాగు చేస్తారంటే...

బీడు భూముల్లో 3x3 సైజులో గోతులు తీసి విత్తనం వేయాలి. సీడ్ కోటింగ్ చేసి మట్టి ముద్దలో పెట్టాలి. తరువాత ఈ విత్తన గుళిక లను భూమిలో పూడ్చుతారు. ఇలా పూడ్చిన విత్తనాలు వర్షం రాగానే మొలకెత్తుతాయి. వర్షా ధారంగా పండుతాయి. దీంతో బీడు భూము ల్లోనూ సాగు చేసేందుకు అవకాశం ఉంటుంది. కొన్ని రోజులకు పంట దిగుబడి వచ్చి రైతులకు ఆర్థిక రాబడి పెరుగుతుంది.

రైతులకు భారం కాకుండా..

వాతావరణ మార్పులతో అతివృష్టి, అనావృష్టి ప్రభావం పెరిగి పంటల సాగు రైతులకు కడు భారంగా మారుతోంది. సాగు చేసినప్పటి నుంచి పంట చేతికి వచ్చే వరకు దిగుబడిపై నమ్మకంలేని పరిస్థితి. వేల రూపాయలు ఖర్చు చేసి రైతన్నలు వ్యవసాయ పంటలు సాగు చేయాలంటే వెన్నులో వణుకు పుట్టే పరిస్థితి నెలకొంది. చాలామంది పం టల సాగుకు ఆసక్తి కనబరచడం లేదు. తాజాగా డ్రాఫ్ట్ ప్రూపింగ్ మోడల్‌తో బీడు భూముల్లో పంటల సాగును శ్రీకారం చుట్టడంతో ఖరీఫ్‌లో సాగు చేయకుండా వదిలేసిన భూములతోపాటు ఏన్నో ఏళ్లగా బీడుగా ఉన్న భూముల్లోనూ పంటలు సాగవుతున్నాయి.

ఎకరా విస్తీర్ణంలో పంటలు



తొండూరులో ఎకరా విస్తీర్ణంలో కంది, ఆముదం ప్రధాన పంటలుగా సాగు చేశాను. వాటితో పాటు అంతర పంటలుగా సజ్జ, అనప, ఆలసంద, మటిక పంట లను సాగు చేశాను. ప్రస్తుతం అవి మొలకెత్తాయి. -జగన్‌మోహన్‌రెడ్డి, రైతు, తొండూరు గ్రామం

రైతులను ప్రోత్సహిస్తున్నాం



డ్రాఫ్ట్ ప్రూఫింగ్ ద్వారా బీడు భూముల్లో తక్కువ ఖర్చుతో వ్యవసాయం చేయిస్తున్నాం. పంటలసాగు చేసేలా అవగాహన కల్పిస్తున్నాం. 22 ప్లాట్లలో ఇప్పటికే సాగు చేయించాం. - రామక్రిష్ణరాజు, డీపీఎం, ప్రకృతి వ్యవసాయం

కోదండ రాముడి గ్రామోత్సవం



స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

ఒంటిమిట్ట: ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లు తున్న ఒంటిమిట్ట కోదండ రామాలయం లో కొలువుదీరిన సీతారామలక్ష్మణులకు సోమవారం గ్రామోత్సవం వైభవంగా నిర్వ హించారు. విజయదశమి సందర్భంగా టీటీడీ అధికారుల ఆధ్వర్యంలో మూల మూర్తులను పట్టు వస్త్రాలు, తులసిమా లతో అలంకరించి వీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

కృష్ణా జలాలపై బూటకపు ప్రచారం

- ప్రభుత్వానికి వ్యతిరేకంగా మలిచేందుకు విపక్షాల యత్నం
- బాబుకు 'సీమ' ప్రాజెక్టులతో సంబంధమే లేదు
- ఆయన్ను సమర్థించడమంటే ప్రాజెక్టులను వ్యతిరేకించడమే
- తెలంగాణ ఎన్నికల్లో బీజేపీ లబ్ధికే కేంద్ర క్యాబినెట్ నిర్ణయం
- రాయలసీమ కార్మిక కర్షక సమితి అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి



సాక్షితో మాట్లాడుతున్న సీహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి

సాక్షి ఇంటర్వ్యూ

కడప సెవెన్‌రోడ్స్ : కృష్ణా జలాల పునః పంపిణీ అంశాన్ని ఆయుధంగా మలుచుకుని వైఎస్ జగ న్మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై బురదజల్లే యత్నం ప్రతిపక్షాలు చేస్తున్నాయని రాయలసీమ కార్మిక కర్షక సమితి అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ట్రిబ్యు నల్స్ కేటాయించిన కృష్ణా జలాలను ఏపీ, తెలం గాణ రాష్ట్రాల మధ్య పునః పంపిణీ చేసే బా. ధ్యతను బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు అప్పగిస్తూ ఇటీవల కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేశారు. దీనిపై టీడీపీ, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ తదితర విపక్షాలు జగన్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ ధర్నాలు, సభలు, సమావేశాలు నిర్వ హిస్తున్నాయి. ఈ నేపధ్యంలో రాయలసీమ ఉద్య మనేత సీహెచ్ చంద్రశేఖర్‌రెడ్డిని 'సాక్షి' ఇం టర్వ్యూ చేసింది. వివరాలిలా ఉన్నాయి.

సాక్షి : కృష్ణా జలాల పునః పంపిణీ అంశంపై ప్రతిపక్షాలు సీఎం వైఎస్ జగన్‌ను విమర్శిం చడంపై ఏమంటారు?

సీహెచ్: బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు, కేంద్ర మంత్రివర్గం కృష్ణా జలాల పునః పంపిణీపై తీసు కున్న నిర్ణయంపై ప్రతిపక్షాలు బూటకాలు మాట్లాడుతున్నాయి. ఈ అంశాన్ని జగన్ ప్రభు త్వానికి వ్యతిరేకంగా మలిచే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వంపై బురద జల్లేందుకు దీన్నో ఆయుధంగా ప్రయోగిస్తున్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కరవు ప్రాంతమైన రాయలసీమకు తాగు, సాగునీరు అందించేందుకు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచే పనులు చేప ట్టారు. సీపీఐ మినహా అన్ని పార్టీలు దీన్ని వ్యతిరే కించాయి. ఆనాటి అధికార కాంగ్రెస్‌లోని నాయకులు సైతం కొందరు వ్యతిరేకించారు. అయినా వైఎస్సార్ వీటిని లెక్కచేయకుండా పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని పెంచారు. ఆనాటి కాంగ్రెస్ నాయకులైన డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి, డాక్టర్ ఎంవీ మైసూరారెడ్డి నాయకత్వంలో జరిగిన అపార కృషి ఫలితంగానే నాటి ప్రభుత్వం గాలేరు-నగరి, హంద్రీ-నీవా, వెలిగొండ ప్రాజె క్టులను ప్రకటించింది. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎం అయ్యాక రాయల సీమ ప్రాజెక్టుల నిర్మాణా లను శరవేగంగా చేపట్టారు.

సాక్షి: 'సీమ' ప్రాజెక్టులపై టీడీపీ చేస్తున్న విమర్శలను ఎలా అర్థం చేసుకోవాలి?

సీహెచ్: ఎన్టీ రామారావు రాయలసీమకు తాగు, సాగునీటి అవసరాలు తీర్చేందుకు తెలుగుగంగ, గాలేరు-నగరి, హంద్రీ-నీవా, వెలిగొండ ప్రాజె క్టులను ప్రకటించి చేపట్టారు. అంతేగానీ చం ద్రబాబుకు, ఆయన అధ్యక్షతన ఉన్న టీడీపీకి రాయలసీమ ప్రాజెక్టులు, కృష్ణా జలాల మళ్లిం పుతో నామమాత్రంగా కూడా సంబంధం లేదు. చంద్రబాబు అధికారంలో ఉన్నంత కాలం సీమ ప్రాజెక్టుల సామర్థ్యాన్ని తగ్గించే ప్రయత్నం చేశారు. ప్రాజెక్టులకు ఎలాంటి ప్రాముఖ్యత ఇవ్వలేదు. ఇటీవల చంద్రబాబు, ఆయన పార్టీ నేతలు సీమ ప్రాజెక్టుల సందర్శన పేరుతో పర్య టించడం సిగ్గుచేటు. ప్రతిపక్షాలు చంద్రబాబును సమర్థించడమంటే రాయలసీమ ప్రాజెక్టులను వ్యతిరేకించడమే అవుతుంది.

సాక్షి: కృష్ణా జలాల పునః పంపిణీకి కేంద్ర క్యాబినెట్ నిర్ణయంపై ఏమంటారు?

సీహెచ్: అధికారంలో తొమ్మిది సంవత్సరాలు మౌనంగా ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రస్తుత తెలంగాణ ఎన్నికల్లో గెలుపు కోసం రాయలసీమను బలి చేయడం మంచిది కాదు. బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం వచ్చిన నీటిని పునః పంపిణీ చేయాలని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు బాధ్యతలు అప్పగించే అధికారం కేంద్రానికి లేదు. అంతర్ రాష్ట్ర నదీ జలాల వివాదాల చట్టం 1956ను పార్లమెంటు రూపొందించింది. ట్రిబ్యునల్‌కు ఆదేశం ఇవ్వా లంటే పార్లమెంటులో చర్చించి నిర్ణయం తీసు కోవాలి. అంతేగానీ క్యాబినెట్‌కు నిర్ణయం తీసుకునే అధికారం లేదు. పునఃసమీక్ష ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజల కడగండ్లను తీర్చాలనే ఆదేశాలు ట్రిబ్యునల్‌కు ఇచ్చి ఉంటే అంతా హర్షిస్తారు.

సాక్షి : సీఎం వైఎస్ జగన్ 'సీమ' ప్రాజెక్టుల కోసం చేస్తున్న కృషిపై మీ స్పందన ఏమిటి?

సీహెచ్: వైఎస్సార్ మరణం తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఏపీ రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల గురించి పట్టించు కున్న పాపాన పోలేదు. వైఎస్ జగన్మోహ న్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వాటిని పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు. పోతి రెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని మరింత పెంపు చేసే అంశాన్ని గుర్తించారు. 'సీమ' ప్రాజెక్టులకు సాగునీరు ఇవ్వాలంటే రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టా ల్సిన అవసరాన్ని గుర్తించారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

- వినూత్న సందేశాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్
- స్వయంగా తనిఖీల్లో పాల్గొని దాదాపు 296 వాహనాలు స్వాధీనం చేసుకున్న జిల్లా ఎస్పీ
- మైనర్‌ల తల్లిదండ్రులకు భారీ ఎత్తున కౌన్సెలింగ్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్


స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

కడప అర్బన్ : రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ సమాజ శ్రేయస్సు పేరుతో వినూత్న సందేశాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకుని వచ్చేందుకు వారికి పెద్ద ఎత్తున కౌన్సెలింగ్ చేపట్టారు. తల్లిదండ్రులు నిబంధనలకు విరుద్ధంగా మైనర్లైన తమ పిల్లలకు వాహనాలు ఇచ్చి వారి అందమైన భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టవద్దని సూచించారు. పిల్లలకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని ఎస్పీ పేర్కొన్నారు. ఇటీవల నగరంలో జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 1004 వాహనాలను మంగళవారం స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఉంచి యువకులకు కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు. జిల్లా ఎస్పీ బుల్లెట్ వాహనంపై పర్యటిస్తూ స్వయంగా తనిఖీల్లో పాల్గొని 296 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మరోసారి పట్టుబడితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి వాహనాలను కోర్టులో అప్పచెప్పి సీజ్ చేస్తామని హెచ్చరించారు. అజాగ్రత్త, నిర్లక్ష్యం తగదని సూచించారు. తెలిసీ, తెలియని వయసులోని పిల్లలకు వాహనాలు ఇవ్వడం ద్వారా మీ పిల్లల ప్రాణాలతో పాటు రోడ్డుపై వెళ్లే అమాయకులైన ఎదుటివారికి కూడా ప్రాణాపాయం జరుగుతుందని గుర్తుంచుకోవాలన్నారు. ముందుందు ఇలాగే పట్టుబడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. ఒకసారి జైలుకు వెళితే ఉన్నత చదువులకు విదేశాలకు వెళ్లేందుకు పాస్‌పోర్ట్ రాదని, ఉద్యోగాలు కూడా రావని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ రోడ్డు ప్రమాదాలు జరగడం బాధాకరమన్నారు. ఇంటికి త్వరగా చేరుకోవాలనే ఆతృతతో అతివేగంగా, ర్యాష్‌గా నడపడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. పిల్లలు మేజర్లయిన తరువాత తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తమ వంతు సామాజిక బాధ్యతగా వాహనాలు కొనిచ్చినపుడు లైసెన్స్ తీసుకోవడంతో పాటు, హెల్మెట్‌ను ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, వేగంగా వాహనాలు నడపడం ప్రమాదకరమని, నిబంధనలు అతిక్రమించవద్దని, వారికి హితబోధ చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు. రేపటి పౌరుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడంలో తల్లిదండ్రులదే కీలక పాత్ర అనేది గుర్తించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. కుటుంబ పెద్ద రోడ్డు ప్రమాదాల బారిన పడి తీవ్రంగా గాయపడినా, ప్రాణాలు కోల్పోయినా ఆ కుటుంబం రోడ్డున పడుతుందని, వారు ఆర్థికంగా, సామాజికంగా ఎంతో నష్టపోతారన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ సామాజిక బాధ్యతగా ప్రజలు గుర్తించి తమవంతు పాత్ర నిర్వర్తించాలన్నారు. అర్ధరాత్రి పూట అనవసరంగా రోడ్లపై తిరుగుతూ పోలీసులకు పట్టుబడ్డ ఆకతాయిలకు జిల్లా ఎస్పీ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ఎస్‌వి కృష్ణారావు, కడప డీఎస్పీ ఎం.డీ షరీఫ్, ఏఆర్ డీఎస్పీ రమణయ్య, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

దసరాకు వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం

– చింతకొమ్మదిన్నె వాసి మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సుబ్బరాయుడు

చాపాడు : మండల పరిధిలోని పల్లవోలు గ్రామ సమీపంలో మైదుకూరు – ప్రొద్దుటూరు జాతీయ రహదారిపై మంగళవారం బైక్‌లో వెళుతున్న వ్యక్తి డివైడర్‌ను ఢీకొని రోడ్డుపై కింద పడిపోగా ఆర్టీసీ బస్సు తలపై ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలేటిపల్లెకు చెందిన ఉదయగిరి వెంకట సుబ్బరాయుడు (62) దసరా సందర్భంగా ప్రొద్దుటూరులోని తన బావమ్మర్ది ఇంటికి వచ్చి వెళుతుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. వెంకటసుబ్బరాయుడు బైక్‌పై వెళుతుండగా పల్లవోలు సమీపంలో డివైడర్‌ను ఢీకొని రోడ్డుకు అవతలి వైపున ఎగిరిపడ్డాడు. ఈ క్రమంలో ప్రొద్దుటూరు వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు సుబ్బరాయుడు తలపైకి ఎక్కింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. మృతునికి భార్య, ఒక కుమారుడు, వివాహితులైన ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

క్లుప్తంగా

కారు–బైక్ ఢీ

– ఇద్దరికి గాయాలు

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామ శివారులో ఉన్న పసుపులేటి బ్రహ్మయ్య పెట్రోల్ బంకు వద్ద మంగళవారం సాయంత్రం కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో బైక్‌లో ఉన్న మాధవరం–1కు చెందిన బాలాజీకి కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. ఉప్పరపల్లి గ్రామానికి చెందిన పురుషోత్తంకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నందలూరు నుంచి కడపకు కారు వస్తుండగా బాలాజీ, పురుషోత్తంలు బైక్‌పై కడప నుంచి మాధవరం–1 వైపు వెళ్తున్నారు. రెండు వాహనాలు మాధవరం–1 గ్రామ శివారులో ఉన్న పసుపులేటి బ్రహ్మయ్య పెట్రోల్ బంకు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బాలాజీ తీవ్రంగా గాయపడగా, పురుషోత్తంకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని రిమ్స్‌కు తరలించారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న అడవి పంది

– వ్యక్తి మృతి


శివకోటిరెడ్డి (ఫైల్)

లింగాల : లింగాల మండలం ఎగువ పల్లె గ్రామానికి చెందిన శివ కోటిరెడ్డి, అనే వ్యక్తి (30) ఆదివారం రాత్రి దిగువ పల్లె గ్రామం నుంచి ఎగువ పల్లెకు వెళుతుండగా మార్గం మధ్యలో రోడ్డుకు అడ్డంగా అడవి పంది వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో శివకోటి రెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య హరిత, కుమార్తె ఉన్నారు. అతను ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పాస్టర్ హఠాన్మరణం


ఇశ్రాయేలు (ఫైల్)

పోరుమామిళ్ల : బొప్పాపురానికి చెందిన సిద్దవటం ఇశ్రాయేలు(40) అలియాస్ శ్రీనివాసనం సోమవారం సాయంత్రం హఠాన్మరణం చెందారని గ్రామస్తులు తెలిపారు. నరసాపురంలో పాస్టర్‌గా పనిచేసేవారని, పండుగకు బొప్పాపురం వచ్చి తిరిగి వెళుతుండగా గుండెపోటుతో కూలిపోయాడన్నారు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడని తెలిపారు. పాస్టర్ భార్య చంద్రలీల రెండేళ్ల క్రితం మృతి చెందింది. వారికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. తల్లిదండ్రులిద్దరూ మృతి చెందడంతో పిల్లలు అనాథలయ్యారు. ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ రఘునాథరెడ్డి విజ్ఞప్తి చేశారు.

ప్రమాదవశాత్తు కార్మికుడు మృతి


మనోహర్‌రెడ్డి (ఫైల్)

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొప్పర్తి పంచాయతీ పరిధిలో గల ఏపీఐఐసీ భూముల్లో నూతనంగా నిర్మిస్తున్న కంపెనీల్లో కార్మికుడిగా పనిచేస్తున్న పామిరెడ్డి మనోహర్ రెడ్డి (35) మంగళవారం ఉదయం ప్రమాదవశాత్తు మృతి చెందాడు. సీకే దిన్నె ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి సమాచారం మేరకు మృతుడు పెండ్లిమర్రి మండలం గోసరాపల్లె గ్రామానికి చెందిన వ్యక్తి. ఇతను ఇండస్ట్రియల్ ఏరియాలో కంపెనీకి సంబంధించిన రేకులను పై భాగాన బిగిస్తుండగా జారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని తోటి కార్మికులు రిమ్స్ తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య సరస్వతితో పాటు నాలుగు నెలల కుమార్తె ఉన్నట్లు తెలిపారు.

అధునాతన అగ్నిమాపక వాహనం ప్రారంభం

ప్రారంభించిన డిప్యూటీ సీఎం ఎస్‌బి అంజద్‌బాషా, కడప నగర మేయర్ సురేష్‌బాబు


అగ్నిమాపక వాహనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ కె. సురేష్‌బాబు

కడప అర్బన్ : కడప అగ్నిమాపక కేంద్రానికి నూతనంగా మంజూరైన అధునాతన అగ్నిమాపక వాహనం (మల్టీపర్పస్ టెండర్)ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, కడప నగర మేయర్ కె. సురేష్‌బాబు కడపలోని అగ్నిమాపక కేంద్రంలో ప్రారంభించారు. గతంలో కడప అగ్నిమాపక కేంద్రంలో రెండు అగ్నిమాపక వాహనాలు ఉండేవి. గత ఏడాది వేంపల్లిలో అగ్నిమాపక కేంద్రం మంజూరు కావడంతో అక్కడికి కడప నుంచి ఓ వాహనాన్ని పంపించేశారు. దీంతో కడప నగరంలో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు కమలాపురం, రాజంపేట, మైదుకూరు, వేంపల్లి నుంచి అగ్నిమాపక వాహనాలను తీసుకుని వచ్చేవారు. ఈ క్రమంలో ఆస్తినష్టం ఎక్కువగా సంభవించేది. ఈ క్రమంలో రాష్ట్రంలో ఇటీవల 5 కొత్త వాహనాలను మంజూరు చేసిన సమయంలో ఓ అధునాతన అగ్నిమాపక వాహనాన్ని కడపకు కేటాయించారు. ఈ వాహనాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం, మేయర్ మాట్లాడుతూ ఈ అధునాతన అగ్నిమాపక వాహనంలో 5వేల లీటర్ల సామర్థ్యం ఉన్న నీటి ట్యాంకర్‌తో పాటు, 500 లీటర్ల ఫోమ్ కాంపౌండు, 500 కిలోల డ్రైకెమికల్ పౌడర్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి ఇనపాల ధర్మారావు, సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి బసివిరెడ్డి, కార్పొరేటర్లు షేక్ మహమ్మద్ షఫీ, అజ్మతుల్లాఖాన్, మల్లికార్జున, ఇతర నాయకులు, కడప అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోను ఎందుకు ఢీకొన్నారని ప్రశ్నించినందుకు..

- పిడి బాకుతో దాడి
- ముగ్గురికి గాయాలు


దాడిలో తీవ్రంగా గాయపడిన పవన్‌కల్యాణ్

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక రామేశ్వరం రోడ్డులో ఆటోను బైక్ ఢీ కొన్న సంఘటనకు సంబంధించి ఘర్షణ చోటు చేసుకుంది. బైక్‌లో వెళ్తున్న యువకులు పిడి బాకుతో దాడి చేయగా ముగ్గురికి గాయాలయ్యాయి. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. చక్రాయపేట మండలం నాగులగుట్టపల్లెకు చెందిన నాగేంద్రబాబు కుటుంబంతో పాటు వారి బంధువులైన వేంపల్లెకు చెందిన పవన్‌కల్యాణ్, శివ, రామాంజనేయులు, మహేష్‌లు దసరా పండుగ సందర్భంగా సోమవారం ప్రొద్దుటూరుకు వచ్చారు. అందరూ కలసి సాయంత్రం ఆటోలో రామేశ్వరం రోడ్డు మీదుగా పట్టణంలోకి బయలుదేరారు. ఈ క్రమంలో కొంత దూరం వెళ్లగానే ముగ్గురు వ్యక్తులు బైక్‌లో స్పీడ్‌గా వచ్చి ఆటోను వెనుక వైపున ఢీకొన్నారు. డ్రైవర్ వెంకటేష్ ఆటోను ఆపి బైక్‌తో ఢీకొట్టిన ముగ్గురు వ్యక్తులను ప్రశ్నించే క్రమంలో అతనితో వారు వాగ్వాదానికి దిగారు. దీంతో ఆటోలో ఉన్న వ్యక్తులు సర్ది చెబుతుండగా ముగ్గురు యువకులు వారి వద్ద ఉన్న పిడి బాకుతో దాడి చేశారు. ఈ సంఘటనలో వెంకటేష్, పవన్‌కల్యాణ్, నాగేంద్రలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. వారిలో పవన్‌కల్యాణ్ పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి తీసుకెళ్లారు. దాడి చేసిన యువకులు పెండ్లిమర్రి మండలానికి చెందిన ప్రసాద్, బయన్న, భరత్‌లుగా పోలీసుల దర్యాప్తులో తేలింది. వీరిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ రాజారెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి


రామమోహన్‌రెడ్డి కుమారుడు శ్రీహర్షరెడ్డిని ఓదార్చుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


నందిమండలంలో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి


రామమోహన్‌రెడ్డి (ఫైల్)

పెండ్లిమర్రి/కడప అర్బన్ : కడప నగరంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నందిమండలం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ జేసీఎస్ మండల కన్వీనర్, సర్పంచ్ చిలేకంపల్లి రామమోహన్‌రెడ్డి (54) సోమవారం మృతి చెందాడు. ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంలో కడప నగరం ప్రకాశ్‌నగర్‌లోని తన ఇంటి వద్దకు వెళుతుండగా మరో ద్విచక్ర వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం కన్నుమూశాడు. మృతదేహానికి మంగళవారం స్వగ్రామం నందిమండలంలో అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ పార్టీల నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ ఛైర్మన్ దంపతులు ఏ.మల్లికార్జునరెడ్డి, సువర్ణమ్మ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి, జెడ్పీ వైస్ ఛైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు తదితరులు మృతదేహం వద్ద నివాళి అర్పించారు.

కుటుంబానికి అండగా ఉంటాం

చిలేకంపల్లి రామమోహన్‌రెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి హుటాహుటిన మంగళవారం కడప రిమ్స్ మార్చురీకి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. రామమోహన్‌రెడ్డి కుమారుడు శ్రీహర్షరెడ్డితో మాట్లాడారు. ఆయన సతీమణి అనురాధను ఓదార్చారు. కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎంపీ అవినాష్‌రెడ్డి వారికి భరోసా ఇచ్చారు. కాగా రామమోహన్‌రెడ్డికి సతీమణి అనురాధతో పాటు కుమారుడు శ్రీహర్షరెడ్డి, కుమార్తె శ్రీలక్ష్మి ఉన్నారు. శ్రీహర్షరెడ్డి ఓ ప్రైవేట్ సంస్థలో కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నాడు. కుమార్తె శ్రీలక్ష్మి మూడు నెలల క్రితం అమెరికాలో ఎంఎస్ చదువుకునేందుకు వెళ్లింది. రామమోహన్‌రెడ్డి మృతదేహానికి మంగళవారం కడప రిమ్స్ మార్చురీలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. సురేశ్వర్‌రెడ్డి చొరవతో డాక్టర్లు పోస్టుమార్టం నిర్వహించారు. వైఎస్ కుటుంబానికి సన్నిహితుడైన చిలేకంపల్లె రామమోహన్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తల్లి వైఎస్ విజయమ్మ ఫోన్ ద్వారా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

పలువురికి గాయాలు




మైలా వెంకటసుబ్బయ్య వేలు కొరికేసిన పిచ్చికుక్క, గాయపడిన వంశీవర్ధన్‌రెడ్డి, నీహారిక తలపై గాయమైన దృశ్యం

అట్లూరు : ఓ పిచ్చికుక్క ఒకరిని కాదు ఇద్దరిని కాదు రెండు గ్రామాలను గడగడ లాడించిన ఉదంతం అట్లూరు మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు మండల పరిధిలోని మణ్యంవారిపల్లి గ్రామంలోకి మంగళవారం మధ్యాహ్నం పిచ్చికుక్క ప్రవేశించింది. కనిపించిన మూగజీవాలను విచక్షణారహితంగా గాయపరచింది. అలాగే సుభాష్‌చంద్రారెడ్డి, వంశీవర్ధన్‌రెడ్డి, సుబ్రమణ్యం, నీహారికలను గాయపరిచింది. గ్రామస్తులు వెంబడించడంతో కమలకూరు గ్రామంలోకి ప్రవేశించి పాలకొలను రోశిరెడ్డి అనే వ్యక్తి ముక్కు కొరికేసింది. అలాగే మైలా వెంకటసుబ్బయ్య కుడిచేతి వేలును సగం పూర్తిగా తినేసింది. అంతటితో ఆగకుండా మరికొంతమందిని స్వల్పంగా గాయపరిచింది. గాయపడిన వారిని వెంటనే ఆయా గ్రామాల ప్రజలు బద్వేలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అలాగే పదుల సంఖ్యలో పశువులను, గొర్రెలను, మేకలను, కుక్కలను కూడా గాయపరిచినట్లు గ్రామస్తులు తెలిపారు.

మహిళపై దాడి

లింగాల: లింగాల మండలం దొండ్లవాగు గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి అనే మహిళపై అదే గ్రామానికి చెందిన హరిశివారెడ్డి అనే వ్యక్తి కర్రతో దాడి చేశాడు. దాడిలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. సురేంద్రనాథ్‌రెడ్డి, హరిశివారెడ్డిలు పొలాల్లో వర్షపు నీరు ప్రవహిస్తుండటంపై తరచూ గొడవ పడేవారు. ఈ నేపథ్యంలో హరిశివారెడ్డి ఆదివారం రాత్రి సురేంద్రనాథ్‌రెడ్డి భార్య ఆదిలక్ష్మిపై దాడి చేసి గాయపరిచాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

బి.కోడూరు : మండలంలోని అంకనగొడుగునూరు ఎస్సీ కాలనీకి చెందిన అన్నదమ్ములు కోడూరు విజయరావు, కోడూరు రాంబాబు ఈనెల 18న ఘర్షణ పడ్డారు. తీవ్రంగా గాయపడిన రాంబాబు తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 22వ తేదీ మృతి చెందాడు. ఈ మేరకు రాంబాబు భార్య రామలీల ఫిర్యాదు మేరకు పోలీసులు విజయరావును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు మండల పరిధిలోని ద్వారకానగర్‌లో పేకాట ఆడుతున్న 26 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 14.66 లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ వివరాలను ఏఎస్పీ ప్రేరణాకుమార్ సాయంత్రం మీడియాకు వెల్లడించారు. ద్వారకానగర్‌లోని రామాలయం సమీపంలో గల మార్తల ఇంద్రసేనారెడ్డి ఇంట్లో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో మంగళవారం వేకువజామున రూరల్ పోలీసులు, సెబ్ అధికారులు, కడప స్పెషల్ బ్రాంచ్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. దాడిలో పేకాట ఆడుతున్న దర్గా చౌషన్‌బాషాతో పాటు 25 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద ఉన్న రూ. 14,66,600 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్పీ తెలిపారు.
అసాంఘిక కార్యకపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నట్లు ఏఎస్పీ ప్రేరణాకుమార్ తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐ రమణారెడ్డి, సెబ్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి, ఎస్ఐలు చిరంజీవి, శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా షెడ్యూలు విడుదల

– ఈనెల 27 నుంచి నవంబర్ 4 వరకు జిల్లాస్థాయి ఎంపికలు

కడప స్పోర్ట్స్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లాస్థాయి క్రీడాఎంపికలకు సంబంధించిన క్రీడా షెడ్యూలును విడుదల చేశారు. ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలోని వివిధ మైదానాలు వేదికగా అక్టోబర్ 27 నుంచి నవంబర్ 4వ తేదీ వరకు అండర్–14, అండర్–17 బాలబాలికల విభాగాల్లో జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు డీఈఓ వై. రాఘవరెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు స్టడీ సర్టిఫికెట్, చైల్డ్ ఐడీ, పుట్టినతేదీ ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు తదితర సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

తేదీ	క్రీడాంశం	వేదిక
27-10-23	నెట్‌బాల్	జెడ్పీహెచ్ఎస్, రామనపల్లి, చెన్నూరు
28-10-23	స్విమ్మింగ్	వైఎస్ఆర్ క్రీడాపాఠశాల, కడప
28-10-23	హాకీ	వైఎస్ఆర్ క్రీడాపాఠశాల, కడప
28-10-23	ఫుట్‌బాల్	వైఎస్ఆర్ క్రీడాపాఠశాల, కడప
28-10-23	సైక్లింగ్	కేంద్రీయ విద్యాలయ, కడప
30-10-23	బాల్ బ్యాడ్మింటన్	డీఎస్‌ఏ మైదానం, కడప
30-10-23	బ్యాడ్మింటన్	వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియం, కడప
30-10-23	సెపక్‌తక్రా	డీఎస్‌ఏ స్టేడియం, కడప
31-10-23	త్రోబాల్	జెడ్పీహెచ్ఎస్, నీలకంఠరావుపేట, రామాపురం
31-10-23	కరాటే	గౌరీశంకర్ హైస్కూల్, రైల్వేకోడూరు
01-11-23	టెన్నికాయిట్	జెడ్పీహెచ్ఎస్, మాసాపేట, రాయచోటి
02-11-23	ఖోఖో	వై.వి.ఎస్.ఎం.హెచ్.ఎస్. ప్రొద్దుటూరు
02-11-23	వాలీబాల్	జెడ్పీహెచ్ఎస్ అలీమాబాద్, రాయచోటి
04-11-23	బాస్కెట్‌బాల్	విద్యామందిర్, కడప
04-11-23	కుడో	జెడ్పీ హైస్కూల్, మంగంపేట, రైల్వేకోడూరు

దసరా ఉత్సవాల్లో అపశ్రుతి

పోలీసు అధికారులకు గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఏఎస్పీ

ప్రొద్దుటూరు క్రైం : దసరా ఉత్సవాల్లో భాగమైన శమీ దర్శనం సందర్భంగా స్థానిక ఎస్ఎస్‌మాల్ సమీపంలో ఒక పాతగోడ కూలి అక్కడే విధులు నిర్వహిస్తున్న రూరల్ ఎస్ఐ చిరంజీవిపై పడింది. గోడ రాళ్లతో పాటు జనం కూడా ఎస్ఐపై పడటంతో ఆయనకు ఊపిరి ఆడనంత పరిస్థితి ఏర్పడింది. తర్వాత పక్కనే ఇద్దరు వ్యక్తులు రాళ్లలో కూరుకున్న ఎస్ఐని బయటికి లాగడంతో ప్రాణాపాయం తప్పిపోయింది. ఈ సంఘటనలో మైలవరం పీఎస్‌లో పని చేస్తున్న ఏఎస్ఐ లక్ష్మీరెడ్డికి కూడా గాయాలయ్యాయి.

క్రాకర్స్ తగులుకొని ఏఎస్పీకి గాయాలు

అమ్మవారి తొట్టిమెరవణి సందర్భంగా మంగళవారం వేకువ జామున బందోబస్తును పర్యవేక్షించేందుకు ఏఎస్పీ ప్రేరణాకుమార్ శివాలయం సెంటర్‌కు చేరుకున్నారు. క్రాకర్స్ కాలుస్తుండగా అందులో ఒక క్రాకర్ సమీపంలో ఉన్న ఏఎస్పీ ప్రేరణా కుమార్ కాలు మీద పడటంతో గాయమైంది. దీంతో ఏఎస్పీని వెంటనే చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అనంతరం కొన్ని గంటల తర్వాత ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఫోన్ చేసి ఏఎస్పీని పరామర్శించారు.

పోరుమామిళ్ల చెరువులో విద్యార్థి మృతి


మృతి చెందిన వసంత్‌రెడ్డి

పోరుమామిళ్ల : సరదాగా చెరువులో ఈతకు వెళ్లిన విద్యార్థి మృత్యువాత పడిన ఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన ఇంటర్ విద్యార్థి వసంత్‌రెడ్డి సోమవారం స్నేహితుని వెంట మండలంలోని తిరువెంగళాపురం వచ్చాడు. మంగళవారం పోరుమామిళ్ల చెరువులో ఈతకు వెళ్లి మృతి చెందాడు.

వివరాలిలా ఉన్నాయి. మైదుకూరు గాంధీ నగరానికి చెందిన కొండా సుమంత్‌రెడ్డి గుంటూరు విజ్ఞాన్ కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. అదే తరగతిలో చదువుతున్న మనోజ్‌రెడ్డి మంచి స్నేహితుడయ్యాడు. మనోజ్‌ది తెనాలి. అతనితో కలసి తెనాలికి వెళ్లేవాడు. తెనాలిలో మనోజ్ మామ కొడుకు వసంత్ రెడ్డితో పరిచయం స్నేహంగా మారింది. మనోజ్, వసంత్‌లను దసరా సెలవులు ముగుస్తున్నందున సుమంత్ తన ఊరికి ఆహ్వానించాడు. సుమంత్ అవ్వగారి ఊరు తిరువెంగళాపురం. మనోజ్, వసంత్‌రెడ్డి ఆదివారం రాత్రి తెనాలి నుంచి బయలుదేరి సోమవారం ఉదయం పోరుమామిళ్లలో బస్సు దిగి సుమంత్‌రెడ్డి అవ్వగారి ఊరు తిరువెంగళాపురం వెళ్లారు. మంగళవారం మధ్యాహ్నం భోజనం చేశాక నలుగురైదుగురు పిల్లలు సరదాగా చెరువులోకి ఈతకు వెళదామని బయలు దేరారు. వసంత్‌కు ఈత రాదు. చెరువులో దిగి గుంతలో చిక్కుకోవడం గమనించిన స్నేహితులు కేకలు వేసి, ఊర్లోవారిని పిలిచారు. వారు వచ్చి అతన్ని బయటకు తీసేసరికే నీళ్లల్లో ఊపిరి ఆడక వసంత్ రెడ్డి(17) మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డిని విచారించగా వసంత్‌రెడ్డి తెనాలికి చెందిన భూపాల్ రెడ్డి కుమారుడని, తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు బయలుదేరి వస్తున్నారన్నారు. కేసు నమోదు చేసి విచారిస్తామన్నారు. కాగా వసంత్ మృతితో భయపడిన సుమంత్ స్పృహ కోల్పోయాడు. అతన్ని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. మనోజ్ కూడా భయంతో మాట్లాడలేని పరిస్థితి. భూపాల్‌రెడ్డికి వసంత్ ఒక్కడే కుమారుడు.